పరమేశ్వరా.. ఏమిటీ పార్కింగ్ కష్టాలు!

- ఆలయం ఎదుట ప్రధాన రోడ్డుపైనే వాహనాలు
- పాదచారులు, వాహనదారులకు ఇక్కట్లు
- ఏడాదికి రూ. 21కోట్లు ఆదాయం వస్తున్నా పార్కింగ్ స్థలం కరువు
- పోలీస్‌స్టేషన్ వద్దే ప్రయాణికులను దింపేస్తున్న ఆర్టీసీ బస్సులు

మహానంది: రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో భక్తులకు పార్కింగ్ కష్టాలు తప్పడం లేదు. సరైన పార్కింగ్ స్థలం లేకపోవడంతో పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ వాహనాలను ఆలయం ఎదురుగా ఉన్న నందిసర్కిల్, మాడవీధుల్లో, ప్రధాన రోడ్డుపైనే నిలుపుకోవాల్సి వస్తుండటంతో ఇతర వాహనదారులతో పాటు భక్తులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆదాయం వస్తున్నా పార్కింగ్ స్థలం లేదు

మహానంది ఆలయానికి నిత్యం రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు వస్తుంటారు. మహానందిలో టోల్‌గేట్ల నిర్వహణకు భారీ డిమాండ్ ఉంటుంది. అందులో భాగంగానే ఈ ఏడాది రూ. 1.68 కోట్ల ఆదాయం లభించింది. దీంతో పాటు మహానందీశ్వరుడికి ఏడాదికి రూ. 21కోట్లు ఆదాయం ఉంది. ఇంత ఆదాయం వస్తున్నా వచ్చే భక్తుల వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి సరైన స్థలం కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ప్రత్యేక పార్కింగ్ స్థలం లేకపోవడంతో చేసేదేమిలేని భక్తులు వారి వాహనాలను నందిసర్కిల్ చుట్టూ, అక్కడికీ నిండిపోతే మాడవీధుల్లోనూ, ప్రధాన రహదారిపైనే ఆపాల్సి వస్తుంది. తాజాగా శనివారం నంది సర్కిల్ దాటి కరివేన సత్రం వరకు వాహనాలు రోడ్డుపైనే ఉన్నాయి. దీంతో ఆర్టీసీ బస్సులు సైతం ఆలయ ప్రాంగణంలోకి వచ్చేందుకు వీలు లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్ వద్దే ప్రయాణికులను దింపి అక్కడి నుంచే వెనుదిరగాల్సి వచ్చింది. ఆలయానికి వచ్చే ఆదాయాన్ని చూసే అధికారులు భక్తులకు కల్పించాల్సిన వసతుల పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి భక్తుల వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి ప్రత్యేక స్థలం కేటాయిస్తే వచ్చి వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుందని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.


ఆలయం ఎదురుగా ప్రధాన రోడ్డుపైనే వాహనాలను ఆపిన దృశ్యం


మాడవీధిలో నిలిపిన వాహనాలు


పోలీస్‌స్టేషన్ వద్దే ప్రయాణీకులను దింపుతున్న ఆర్టీసీ డ్రైవర్

క్లుప్తంగా

సచివాలయంలోనే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ


సచివాలయంలోనే కార్డులు పంపిణీ చేస్తున్న వీఆర్వో

ఆత్మకూరు: ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాల్సిన స్మార్ట్ రేషన్ కార్డులను శనివారం ఎంపీడీఓ కార్యాలయంలోని 7వ వార్డు సచివాలయంలో వీఆర్వో నూర్జహాన్ లబ్ధిదారులకు పంపిణీ చేసి చేతులు దులిపేసుకున్నారు. వాస్తవానికి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి తంబ్/ఐరిస్/ఓటీపీ తీసుకుని కార్డులను అందించాల్సి ఉంది. అయితే వీఆర్వో హాయిగా సచివాలయంలోనే కూర్చొని లబ్ధిదారులకు పిలిపించి కూటమి నేతల ఆధ్వర్యంలో కార్డులను చేతిలో పెట్టేయడంతోపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పనులు నాణ్యతతో చేయాలి

కొత్తపల్లి: తాగునీటి పైప్‌లైన్ పనులను నాణ్యతతో చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహమ్మద్ జుబేర్ కాంట్రాక్టర్ మద్దిలేటి యాదవ్‌కు సూచించారు. జానాల గూడెం, బలపాలతిప్ప, సిద్ధేశ్వరం గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటి కుళాయి పైప్ లైన్ పనులను శనివారం పరిశీలించి పలు సలహాలిచ్చారు.

స్వయం ఉపాధిపై శిక్షణ


విద్యార్థుల పనితీరును పరిశీలిస్తున్న హెచ్‌ఎం అబ్దుల్ రాఫీ

బండి ఆత్మకూరు: ఇంటర్న్ షిప్ ద్వారా విద్యార్థులకు స్వయం ఉపాధి కల్పించే దిశగా దసరా సెలవుల్లో బ్యూటీ - వెల్‌నెస్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చామని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అబ్దుల్ రాఫీ తెలిపారు. శనివారం ఆయన శిక్షణ పూర్తి చేస్తున్న విద్యార్థులను పరీక్షించారు. ఫేసియల్, మేనిక్యూర్, పెడిక్యూర్, మెహందీ తదితర వాటితో పాటు గాల్వానిక్, హై ఫ్రీక్వెన్సీ, డాండ్రఫ్ ట్రీట్మెంట్‌పై ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జీసీడీఓ నాగసువర్చల పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలి


నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

నందికొట్కూరు: ఉపాధ్యాయులకు పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఫ్యాప్టో నాయకులు ఆంజనేయులు కోరారు. శనివారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ముజాహిద్ పాషా, ఫ్యాప్టో నాయకులు ప్రమీలరాణి పాల్గొన్నారు.

నిత్యకళారాధనలో తోలుబొమ్మలాట

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన వైవీ నరసింహారావు వారిచే తోలుబొమ్మలాట కార్యక్రమం ఏర్పాటు చేశారు. మహాభారతంలోని నర్తనశాల ఘట్టాలను తోలుబొమ్మలాటలో ప్రదర్శించారు.

సర్దుబాటు చార్జీలు మోపొద్దు

ఆత్మకూరు: విద్యుత్ సర్దుబాటు చార్జీలు వినియోగదారులపై మోపొద్దని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం వారు పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. 2024–25 సంవత్సరంలో వసూలు చేసిన ట్రూ అప్ చార్జీలను వినియోగదారులకు తిరిగి ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో వినియోగదారులతో కలిసి ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, వీరన్న పాల్గొన్నారు.

కనుల పండువగా వసంతోత్సవం


వసంతోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు: పట్టణంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వసంతోత్సవంతో ముగిశాయి. ఆర్యవైశ్యులతో పాటు పట్టణ ప్రజలు వసంతోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. అంతకుముందు అమ్మవారి శాల నుంచి మేళతాళాల మధ్య పుర వీధులగుండా ఊరేగింపు నిర్వహించారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

పాములపాడు: దళితుడి భూమి ఆక్రమించేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా మెంబర్ లింగాల నాగరాజు డిమాండ్ చేశారు. బాధిత రైతు, రుద్రవరం గ్రామానికి చెందిన దళితుడు జనార్దన్‌రావు పొలాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జనార్దన్‌రావు పొలాన్ని ఆక్రమించుకోవాలనే దురుద్దేశంలో అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామసుబ్బయ్య, సర్పంచ్ రామస్వామి రాత్రికిరాత్రే పొలంలో జమ్మి చెట్టు నాటి దానికి పూజలు చేసి భయభ్రాంతులకు గురిచేశారన్నారు. వీరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

భూసర్వేకు రైతులు సహకరించాలి

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామ పరిధిలోని 35బొల్లవరం రెవెన్యూ పరిధిలో జరుగుతున్న సమగ్ర భూ సర్వేకు రైతులు సహకరించాలని వీఆర్వో బాలకృష్ణ కోరారు. శనివారం 35 బొల్లవరం రెవెన్యూ పరిధిలోని రైతుల పొలాల్లో సమగ్ర భూసర్వేను ప్రారంభించారు. వీఆర్ఏల సూచనల మేరకు పొలం సర్వే జరుగుతున్న రైతులు వారి ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్సు కాపీలతో పాటు ఓ పాస్ ఫొటో, పొలానికి సంబంధించిన డీపట్టా, రిజిస్ట్రేషన్ కాగితాలు ఏమైనా ఉంటే వాటి జిరాక్సులను తీసుకువచ్చి సర్వేకు సహకరించాలన్నారు.

8న ‘చలో తిరుపతి’


వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

నందికొట్కూరు: విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8న చలో తిరుపతి కార్యక్రమం చేపట్టనున్నట్లు సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన విద్యుత్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులతో కలిసి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. 10 ఏళ్ల సర్వీస్ దాటిన వారందరికీ 2018లో రివిజన్లు చేసిన సర్వీసును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగులకు, పెన్షనర్లకు, కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలన్నారు. డిమాండ్ల సాధన కోసం తలపెట్టిన చలో తిరుపతి కార్యక్రమానికి విద్యుత్ కార్మికులు భారీ సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ కార్మికుల జేఏసీ జిల్లా నాయకులు మధు, కృష్ణ, మధుకుమార్, మల్లికార్జున, తాలుకా నాయకులు విజయ్, రాజు, వెంకటేశ్వర్లు, రమేష్, సునీల్, పార్టీ నాయకులు సోమన్న, గిడ్డయ్య, రాము, రామన్న, కరుణాకర్, హుసేన్, బాబు, అరవిందు, మహబూబ్, జయ, రవికుమార్, వెంకటయ్య, భూషణం, రాజు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే జైలుశిక్ష

మహానంది: వన్యప్రాణులను వేటాడితే జైలుశిక్ష తప్పదని చలమ రేంజ్ ఎఫ్ఎస్ఓ విజయవర్ధన్, ఏబీఓ మద్దిలేటిస్వామి హెచ్చరించారు. గాజులపల్లె మజరా గ్రామమైన బసాపురంలో శనివారం సాయంత్రం వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వన్యప్రాణులను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అన్నారు.

మహానందిలో భక్తజన సందడి

మహానంది: మహానందిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వీకెండ్‌తో పాటు పెళ్లిళ్లు అధికంగా ఉండటంతో వేలాది మంది భక్తులు తరలివచ్చి కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లతో పాటు కోదండరామాలయం, వినాయకనంది, గరుడనంది ఆలయాలను సందర్శించారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ నెలకొంది. భక్తులరద్దీకి అనుగుణంగా ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్యలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉచిత, శీఘ్రదర్శనం, అభిషేకం ఆర్జిత సేవా టికెట్ల ద్వారా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.


మహానందీశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు

శుభకార్యం


చాంద్‌బాషాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: వెంగల్‌రెడ్డి నగర్‌లోని మనియార్ చాంద్ బాషా కుమార్తె వివాహ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈయన వెంట శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో సినీ దర్శకులు


దర్శనానికి వచ్చిన సినీ దర్శకులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ప్రముఖ సినీ దర్శకులు హరీశ్ శంకర్, మల్లిడి వశిష్ట శనివారం పూజలు నిర్వహించారు. శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో వారిని చూసిన భక్తులు ఫొటోలు తీసుకుని అభిమానం చాటుకున్నారు. బింబిసార సినిమా తనకు ఎంతో గుర్తింపు ఇచ్చిందని, మెగాస్టార్ చిరంజీవి నటించిన విశ్వంభర చిత్రానికి కథా, దర్శకత్వం వహించానని తెలిపారు.

లౌకిక, సామ్యవాద పదాలను తొలగిస్తే సహించం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

నందికొట్కూరు: రాజ్యాంగం నుంచి లౌకిక, సామ్యవాద పదాలను తొలగిస్తే సహించే ప్రసక్తే లేదని మాలమహానాడు తాలూకా అధ్యక్షులు పబ్బతి శివప్రసాద్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం మార్చేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలు చేస్తున్నాయన్నారు. ఇప్పటికే రాజ్యాంగ సవరణల పేరుతో అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ కింద 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేశారన్నారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం 52 శాతం రిజర్వేన్లు ఇవ్వడానికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఎందుకు ఆటంకాలు కలిగిస్తున్నాయన్నారు. అగ్రకులాలపై ఉన్న ప్రేమ బీసీలపై ఎందుకు లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లింలు, క్రిష్టియన్ మైనార్టీలు ఈనెల 9న కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా చలో విజయవాడ కార్యక్రమం చేపట్టారని, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం చలో విజయవాడ కార్యక్రమం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు అబ్రహం, పుల్లన్న, నాగరాజు, రాజు, అయ్యన్న, ఏసన్న, కుమార్, నరసింహులు, ఉస్మాన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అక్రమాలను వెలుగులోకి తెస్తే కేసులా

- వైఎస్సార్‌సీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర గుప్తా


మహానందికి వచ్చిన జగదీశ్వర్ గుప్తా, కుటుంబ సభ్యులు

మహానంది: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నించినా, వెలుగులోకి తెచ్చినా అక్రమ కేసులతో సాక్షి పత్రిక ఎడిటర్, విలేకరులను వేధిస్తున్నారని, ప్రశ్నించే గొంతుకను ఎవరూ ఆపలేరని వైఎస్సార్‌సీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్ గుప్తా అన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఆయన మహానందికి వచ్చారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారి దర్శనం అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి నాయకుల అండదండలతో పోలీసులు సాక్షి మీడియా సంస్థపై దాడులు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి బెదిరిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం అవడం ఖాయమన్నారు. రాబోయే రోజుల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఆయన వెంట గజ్వేల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ మేదిన రామలింగారెడ్డి ఉన్నారు.

మృతదేహం లభ్యం

బండి ఆత్మకూరు: మండలంలోని నాయిని చెరువు వద్ద తెలుగు గంగ ప్రధాన కాలువలో ఈనెల 1న గల్లంతైన భూమా వెంకటేశ్వర రెడ్డి (35) మృతదేహం శనివారం లభ్యమైందని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. లింగాపురం గ్రామానికి చెందిన భూమా వెంకటేశ్వర రెడ్డి తెలుగు గంగ ప్రధాన కాలువలో గల్లంతైన రోజు నుంచి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల ద్వారా గాలింపు చర్యలు చేపట్టామని, శనివారం ఆళ్లగడ్డ తాలూకాలోని రుద్రవరం చెరువులో అతడి మృతదేహం లభ్యమైందని తెలిపారు. మృతుడికి భార్య భూలక్ష్మి, కుమారులు విష్ణువర్ధన్‌రెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి ఉన్నారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కుల వివక్ష నిర్మూలనే లక్ష్యం

ఆత్మకూరు: కుల వివక్ష నిర్మూలనే లక్ష్యంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) పనిచేస్తోందని సమితి జిల్లా గౌరవాధ్యక్షులు వి.యేసురత్నం, జిల్లా సహాయ కార్యదర్శులు పాతకోట భాస్కర్, ఎన్.సంపత్ అన్నారు. కేవీపీఎస్ వారోత్సవాల సందర్భంగా శనివారం సంగమేశ్వరం సర్కిల్ వద్ద కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించారు.


పర్యాటకులతో పోటెత్తిన మూర్వకొండ ఘాట్

మూర్వకొండ ఘాట్‌కు పోటెత్తిన పర్యాటకులు

పగిడ్యాల: కృష్ణానది పరివాహక గ్రామమైన నెహ్రూనగర్ మూర్వకొండ ఘాట్‌కు శనివారం పర్యాటకులు పోటెత్తారు. కనుచూపు మేర విస్తరించిన శ్రీశైలం బ్యాక్‌వాటర్ అందాలను ఆస్వాదించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. దసరా ఉత్సవాలకు వచ్చిన బంధువులు, స్నేహితులు పిల్లాపాపలతో నదీతీరానికి చేరుకుని సెల్ఫీలు తీసుకుని కృష్ణమ్మ అలల సవ్వడులతో తన్మయత్వం పొందుతున్నారు. నదీస్నానాలు ఆచరించి కృష్ణమ్మకు పూజలు నిర్వహించుకుంటున్నారు. ఇంజిన్ బోట్లలో నదిలో విహరిస్తూ వినోదాన్ని పొందుతున్నారు.


కృష్ణా బ్యాక్‌వాటర్‌లో లోపలికి వెళ్లి స్నానాలు ఆచరిస్తున్న మహిళలు, (ఇన్‌సెట్)ఇంజిన్‌బోటులో విహరిస్తున్న పర్యాటకులు

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

- డీఈఓ జనార్దన్‌రెడ్డి


మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి

నందికొట్కూరు/బండిఆత్మకూరు: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని విద్యాశాఖ జేడీ అబ్రహాం, డీఈఓ జనార్దన్‌రెడ్డి అన్నారు. నందికొట్కూరు సాయి బీఈడీ కళాశాలలో, బండిఆత్మకూరు మండలం పార్నపల్లె సమీపంలోని ప్రభాత్ కళాశాలలో కొనసాగుతున్న నూతన ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు జాతి నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు. ఎంఈఓలు రామిరెడ్డి, సుభాన్, ఏపీఓ రామమోహన్‌రావు, సెంటర్ ఇన్‌చార్జ్ నాగేంద్ర, ప్రసాద్, పీడీలు వీరన్న, శ్రీనివాసులు, కోర్స్ డైరెక్టర్లు యశోద, శ్రీ మోహన్‌రెడ్డి, ఏఎంఓ మాధవీలత, సెక్షనల్ ఆఫీసర్లు ప్రసన్నకుమార్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భవనాసి వాగుపై వంతెన నిర్మించాలి

ఆత్మకూరు: పట్టణ సమీపంలోని భవనాసి వాగుపై వంతెన నిర్మించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బాషపోగుల దరగయ్య, జిల్లా నాయకులు కాటేపోగు నాగయ్య, మండల అధ్యక్షులు వనమాల పుల్లయ్య, గ్రామ ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణ డిమాండ్ చేశారు. శనివారం వారు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆంజనేయులకు వినతి పత్రం అందించారు. వర్షాకాలంలో భవనాసి వాగు ఉధృతంగా ప్రవహించడం వల్ల వడ్లరామాపురం, కురుకుంద, కొట్టాల చెరువు, కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయని, వంతెన నిర్మించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ హామీ ఇచ్చారు.


నెహ్రూనగర్‌లో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


నిమజ్జనానికి తీసుకొచ్చిన అమ్మవారి విగ్రహం

వైభవంగా అమ్మవారి నిమజ్జనం

పగిడ్యాల: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పగిడ్యాల, బీరవోలు, లక్ష్మాపురం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలను శనివారం నిమజ్జనం చేశారు. విగ్రహాలను ట్రాక్టర్లలో ఊరేగింపుగా కేసీ కాలువ వద్దకు తరలించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. ఊరేగింపు సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

హైదరాబాద్ దుర్గమ్మ మహానందిలో నిమజ్జనం

మహానంది: హైదరాబాద్‌లో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పూజలందుకున్న దుర్గాదేవి విగ్రహాన్ని నిర్వాహకులు శనివారం మహానంది సమీపంలోని అయ్యన్ననగర్ వద్ద ఉన్న తెలుగుగంగ కాలువలో నిమజ్జనం చేశారు. అనంతరం కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఆనవాయితో భాగంగా ఏటా అమ్మవారిని ఇక్కడే నిమజ్జనం చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.